కథా నిలయం
2276
శ్రీకాకుళం

# సుఖం

వీథి వైపు గదిలో కిటికి దగ్గర ఉన్న మంచంమీద కూర్చొని, కిటికీలోనుంచి బయటికి చూస్తున్నాడు విశ్వం సావిత్రి బజారుకి వెళ్లింది మగపిల్లలు ఇద్దరూ ఆడుకోవటానికి వెళ్లారు. పెద్ద కూతురు వసంత వంట గదిలో ఉంది. కిటికీలోనుంచి చూస్తే ఇంటి ముందు గేటు దాకా ఉన్న పూల చెట్లూ, రోడ్డూ, ఎదురిల్లూ, అక్కడి రాకపోకలూ కనిపిస్తాయి. రాత్రి పూట అకాశంలో నక్షత్రాలు కనిపిస్తాయి. నాలుగు నెలలనుంచీ అతడికి కాలక్షేపం అదే...కిటికీలోనుంచి బయటకు చూడటం.

అతడు పక్క ఎక్కి నాలుగు నెల లయింది, ఇంకా నాలుగు నెలల తరవాత కాళ్ల కట్లు విప్పుతామని హాస్పిటల్ డాక్టర్లు చెప్పారు. అతడు కాళ్లవైపు చూసుకుని నిట్టూర్పు స్తుంటాడు అరగంట కొక సారైనా! 'రెండు కాళ్లమీద మళ్లీ నడవగలనా, జన్మలో ఎప్పటి కైనా?' అనుకుంటాడు. దురదృష్టం! అంతే. కాకపోతే నిక్షేపం లాంటి మనిషి...!

ఎప్పుడూ నవ్వుతూ జీవితపు నిచ్చెన హుషారుగా పైకి ఎక్కుతున్న మనిషి.....పట్టు తప్పినట్లయింది.

ఆ రోజు భోజనానికి ఇంటికి వస్తూంటే, సందు మలుపులో లారీ పెను భూతం లాగ, ఉరుమని పిడుగులాగ వచ్చి మీద పడింది. సైకిల్‌ని గుద్దేసింది. సైకిల్ మీదనుంచి దూకేశాడు గనుక ప్రాణం దక్కింది. రెండు కాళ్లూ విరిగాయి. తెలివి వచ్చేసరికి హాస్పిటల్లో కట్లతో ఉన్నాడు. తన దగ్గరగా నిలబడి ఏడుస్తూంది సావిత్రి. తన చూపు ఆమె మీద పడగానే అంత ఏడుపులోనూ మెరుపులాంటి ఆనందం తొణికింది సావిత్రి మొహంలో. భర్త బతికాడని సంతోషం కాబోలు! గుడ్డిలో మెల్ల అని తృప్తి కాబోలు. ఆ రోజునుంచీ బతుకు మారిపోయింది.

కాలేజీకి వెళ్లాల్సిన తను ఇంట్లో గడుపుతున్నాడు. సావిత్రి కాలేజీలోనే ఉద్యోగం చేస్తోంది. ఆలోచనే ఎరగని తనలో ఒక నిమిషం కూడా ఊపిరి సలపనివ్వటంలేదు ఆలోచనలు.

అప్పుడు ఇంకా ఏవో కొనాలనీ, ఏదో చెయ్యాలనీ ఉద్దేశాలు!

ఇప్పుడు వచ్చేదానితో సరిపెట్టుకోటానికి తంటాలు పడుతున్నారు. అప్పుడు ''పట్టు చీర కొనలేదు పండగకి'' అనేది సావిత్రి.

''చీర లేకపోతేనేం! అందరం సుఖంగా ఉంటే అదే పండగ'' అంటూంది సావిత్రి ఇప్పుడు.

ఇంకా నాలుగు నెలలు గడవాలి. పుస్తకాలు చదువుతూ, పిల్లలకి చదువు చెబుతూ, వాళ్లతో ఆడుతూ కాలక్షేపం చేస్తున్నాడు.

నాలుగు రోజులే ఉంది పండగకి.....ఉగాది! ఆ రోజు సంతోషంగా, సుఖంగా ఉంటే ఏడాదంతా అట్లాగే గడుస్తుంది.

సావిత్రి డబ్బు లేదంటున్నా, మళ్లీ ఇబ్బంది పడతామంటున్నా వినిపించు కోలే దతడు. కొత్త గుడ్డలూ, పిండి వంటలూ లేకుండానే సంక్రాంతి పండగ, రఘు పుట్టిన రోజు గడిచిపోయాయి. తను మంచం ఎక్కాక.

''నా కేం నిక్షేపంలాగ ఉన్నాను. తినగలను, నవ్వగలను. పులిహోర, బొబ్బట్లు చెయ్యి. నీకు, పిల్లలకి బట్టలు కొను'' అన్నాడు.

వందరూపాయల నోటు పర్సులో పెట్టాడు. సావిత్రిని బతిమాలి పంపాడు. సావిత్రి వచ్చే వేళ అయింది.

''అమ్మ ఇంకా రాలేదు, నాన్నా!'' అంది వసంత.

''వస్తుందిలే! పాలు కూడా కాచెయ్యి'' అన్నాడు విశ్వం.

''పొంగాయి...దింపేశాను'' అని అక్కడే చదువుకుంటూ కూర్చుంది వసంత.

ఇంకా నయమే ....ముగ్గురే పిల్లలు! ఈ అవస్థకి తోడు ఆరుగురో, ఏడుగురో ఉంటే ఏమయ్యేది? సావిత్రి వలన అవుతుందా ఆ సంసారం ఈదటం? తన సంగతి తెలియగానే తమ్ముడు వచ్చాడు. అత్తగారు, బావమరిది వచ్చారు. బావమరిది సావిత్రి చేతిలో ఒక వంద పెట్టి వెళ్లాడు. రెండు వారాలుండి, సెలవు లేదని తమ్ముడు వెళ్లిపోయాడు. ఒక నెల సాయపడి అత్తగారు వెళ్లిపోయింది.

తనని చూడటానికి వచ్చిన ప్రిన్సిపాల్ జాలిపడి, సావిత్రికి కాలేజీలో ట్యూటర్గా

పని ఇచ్చారు. సావిత్రి జీతం, తనకి వచ్చే సగం జీతంతో సంసారం గడుస్తూంది ఇప్పుడు.

ఎప్పుడైనా వసంతని వంట చెయ్యమంటే సావిత్రికి కోపం వచ్చేది. ''నేను లేకపోతే మీరు దానికి చదువు మాన్పించి వంట చేయించుకు తినేట్లున్నారు. నేను దానికి ఒప్పుకోను. ఆడ పిల్లలుకూడా చదువుకోవాల్సిందే!'' అని దెబ్బలాడేది.

''భార్యా భర్తల్లో ఒకరు ఉద్యోగం, ఒకరు వంట చేసుకుంటే హాయి. ఆడపిల్లలకి చదువెందుకు?'' అని నవ్వేవాడు తను.

''నేను ఒక వేళ చస్తే ఇది మాత్రం గుర్తు పెట్టుకోండి. వసుకి బి.ఏ. చదివించి మరీ పెళ్లి చెయ్యాలి. ఇది ఒక్కటే నేను కోరే కోరిక'' అనేది సావిత్రి.

చదువుకున్న దవటం వల్లనే ఇప్పుడు సావిత్రి ఆదుకుంది. ఉద్యోగం చేస్తూంది. వసుచేత వంట కూడా చేయిస్తూంది. సావిత్రి!

ఇటువంటి భార్య ఉంటే ఫరవాలేదు. ఎట్లాగైనా బతికెయ్యవచ్చు.

''ఇదివరకు మీరు అంత సంపాదిస్తున్నా తృప్తి ఉండేది కాదు. స్కూటర్ కొనాలని, పట్టు చీరలు, నగలు కొనాలని, ప్రెషర్ కుక్కర్, సోఫాలు కొనాలని కోరికగా ఉండేది. అందరికీ అన్నీ ఉన్నాయి. మనకే లేవని ఆవేదనగా ఉండేది. ఇంట్లో తీరికగా కూర్చుంటే. ఇప్పుడు వంట, ఉద్యోగం, గుడ్డలు కుట్టటం. ... ఇన్ని పనులు చేస్తుంటే.... అప్పుడు మీరు సంపాదించి తెస్తుంటే ఎంత సుఖంగా ఉండేవాళ్లమో అర్థమవుతూంది'' అంటూంటుంది. సావిత్రి ఇప్పుడు.

''మళ్లీ ఆ రోజులు వస్తాయి, సావిత్రీ! నేనూ పాఠాలు చెప్పటానికి విసుక్కునే వాడిని. ఇప్పుడు మళ్లీ ఎప్పుడు కాలేజీకి వెడతానా అని నా ప్రాణం తపిస్తూంది. ఇంకా నాలుగు నెలలు ఓపిక పట్టాలి. మళ్లీ ఉద్యోగం చేస్తాను. నీకు పట్టు చీర, ముత్యాల హారం కొనిపెడతాను. రఘుకి సైకిలు కొంటాను. వసంతని తప్పకుండా బి.ఏ. చదివిస్తాను. దాని చదువు ఎప్పుడూ నిర్లక్ష్యం చెయ్యను'' అని తన ఆశలన్నీ విప్పి చెప్పాడు సావిత్రికి. చెప్పకపోతే భవిష్యత్తులో పెట్టుకున్న నమ్మకం, ఆశలు అతడిని నిలవనియ్యటం లేదు.

సావిత్రి తృప్తిగా నవ్వింది. సావిత్రి... తన భార్య!

తను హాస్పిటల్లో ఉన్నాడు. అందరూ వెళ్లిపోయారు. రోజూ— రెండు పూటలూ— కారేజి పట్టుకుని అర మైలు దూరం నడిచి అన్నం తెచ్చేది. వంట, ఉద్యోగమే గాక సావిత్రికి తన సేవ కూడాను! తీరిక లేని రోజు తలైనా

దువ్వుకోకుండా వస్తే, చూసి తన హృదయం దుఃఖంతో గడ్డ కట్టుకుపోయేది. అందుకే హాస్పిటల్ నుంచి ఇంటికి వచ్చేశాడు పట్టు పట్టి.

''నిన్ను సుఖపెట్టాల్సింది పోయి కష్టపెడుతున్నాను కదూ'' అనేవాడు.

''అట్లాగనకండి. కష్టసుఖాలకి అర్థం అసలు మనకి తెలీదు. ఇది నాకు సుఖంగానే ఉంది'' అనేది సావిత్రి నవ్వుతూ.

రఘు, రాజు ఆడుకుని ఇంటికి వచ్చారు. వస్తూనే -''అమ్మ ఇంకా రాలేదా! '' అన్నాడు ఆశ్చర్యంగా రాజు.

''వస్తుందిరా, ఎందుకో ఆలస్యమై ఉంటుంది'' అంది వసంత.

'ఔను ఇంకా రాలేదెందుకో?'' అనుకున్నాడు విశ్వం.

చీకటి పడుతూంది. లైట్లు వెలిగాయి వీథిలో.

'సావిత్రి ఇంకా రాలేదు. ఈ పాటికి వచ్చేస్తే బాగుండేది' అనుకున్నాడు. అతడికి మనసులో చికాకు కలిగింది.

''అంత గట్టిగా చదవకు, వసూ!'' అని అరిచాడు.

వసు తండ్రి వైపు నిదానంగా చూసి మౌనంగా అక్కడినుంచి వెళ్ళిపోయింది. రాజు ఆడుకుంటున్న బంతి గదిలోకి వచ్చింది. దాని కోసం వచ్చాడు రాజు.

''ఆటలు చాలు. వెళ్లి చదువుకో. చదువు రాకపోతే ఎందుకూ పనికిరారు; అడుక్కుతినాలి'' అని కసిరాడు.

రాజు బంతి తీసుకుని వెళ్లిపోయాడు. ఆ గది నిశ్శబ్దంగా అయింది. కిటికీలోనుంచి బయటకు చూస్తున్నాడు విశ్వం. ఎదురింటినించి కేకలు వినిపించాయి. బాధగా, బరువుగా నిట్టూర్చాడు విశ్వం.

ఆ ఇంట్లో ఒక విధవావిడ, కూతురు, అల్లుడు ఉంటున్నారు. అల్లుడు వెర్రివాడంటారు. ఆవిడకి కొద్దిగా ఆస్తి ఉంది. అల్లుడికి ఉద్యోగం లేదు ఇప్పుడు. సాయంత్రమయ్యేసరికి వాళ్ల చుట్టం ఒకాయన వస్తాడు. అల్లుణ్ణి బయిటికి పొమ్మంటుంది ముసలావిడ. అతడు ఇంటి వరండాలో నిలబడి అరుస్తాడు. పిచ్చివాడని అంటారు అందరూ. అతడికి పిచ్చి ఎక్కితే ఆవిడ తన సుఖం చూసుకుందో, లేక ఆవిడ తన సుఖం చూసుకుంటే అతడికి పిచ్చి ఎక్కిందో ఎవరికి తెలియదు. లోకం నవ్వుతుందనే భయం కానీ, అల్లుడి బాధ కానీ ఆ తల్లీ కూతుళ్లను కదల్చలేదు. ఆవిడ సుఖానికి అడ్డు రాలేదు రోజూ సాగుతుంటుందా వ్యవహారం. పిచ్చి కుక్క లాగ అరవకపోతే, ఆ ఇల్లు వదిలిపెట్టి

పోకూడదూ అనుకుంటాడు విశ్వం. ఏమనుకుని పడి ఉంటున్నాడు! తిండి కోసమా! తిండి కోసమే! బాధతో మెలి తిరిగిపోతుంది విశ్వం మనసు. రోజూ వింటున్నవే అయినా, ఆ కేకలు హృదయాన్ని ఛేదిస్తున్నాయి. అరుచుకుంటూ వెళ్లిపోయాడు అల్లుడు. వీధి మళ్లీ నిశ్శబ్దమయింది.

'ఇంకా ఎందుకు రాలేదు సావిత్రి? ఎవరింటికైనా వెళ్లిందా? ప్రమీలతో కొంచెం స్నేహం గానే ఉంటుంది. ఔను. ఒకే చోట పని చేస్తున్నారు కదా. స్నేహం కలవటం సహజమే. ప్రమీల కాలేజీలో లెక్చరర్. చాలా సరదాగా ఉంటుంది. నేను ఇక్కడ ఒంటరిగా తోచక చస్తుంటే, బాధతో కొట్టు కుంటుంటే.... తను అక్కడ నవ్వుతూ కబుర్లు చెప్పుకుంటోందేమో! ఎంత సేపు కొంటుంది అర్థై రూపాయల గుడ్డలు? ప్రమీల ఇల్లు బ్రహ్మచారులకి అడ్డైకిస్తుంది. ప్రెసిడెంట్ మూర్తి అస్తమానం ప్రమీల ఇంట్లో ఉంటాడు. సావిత్రి అక్కడికి వెళ్లి ఉండదు. వెడితే? బయటికి వెళ్లిన ఆడ దాన్ని నమ్మమని ఎవరన్నారు? అసలు ఈ కాళ్లు మళ్లీ రాకపోతే! నా బతుకు ఇంతే అయితే! సావిత్రి ఇప్పటి లాగే ఉంటుందా? ఇప్పుడు మాత్రం... ఇదివరకు లాగ ఉందా ఏమిటి? కాలేజీలో చేరాక కట్టూ, బొట్టూ, తీరు మారింది. నాజూకు వచ్చింది. ఇంకా మారకుండా ఉంటుందా? ఇప్పటికే మారిందేమో! మూర్తి కళ్లు ఎప్పుడూ ఆడవాళ్లమీద ఉంటాయి. ఆడవాళ్ల కంటే ఎక్కువగా తీర్చిదిద్దుకు వస్తాడు కాలేజీ మీటింగులకి. వ్యవహారాలు సాగిస్తాడంటారు. సావిత్రికేం! చక్కనిది. అతడి కళ్లు సావిత్రిమీద పడితే! నా సావిత్రి అతడికి లొంగిపోతుందా?' అతడి మనసు గిలగిలలాడింది.

'ఛీ వెధవ మనసు. ఎటువంటి ఆలోచనలు చేస్తుంది? స్వర్గాన్ని నరకం చేస్తుంది! సావిత్రి మంచిదని, నాదేనని నాకు తెలుసు. అయినా, మనసు ఇట్లాగ దుర్మార్గంగా ఆలోచించటానికి ఎందుకు ఊహిస్తుంది?

అత్తయ్య కూతురు వనజని వేళాకోళం చేసినా, ప్రమీలతో సరదాగా మాట్లాడినా సావిత్రి ముఖం ముడుచుకునేది, ఏమీ అనకపోయినా నన్ను. తనే అనేవాడు: ''నీకు అనుమానం, అసూయ. స్త్రీ బుద్ధి'' అని. ఇప్పుడు సావిత్రి బయటకు వెళ్లి, తను ఇంట్లో ఉంటే... తనే అనుమానంతో అసూయతో బాధ పడుతున్నాడు. అది స్త్రీ బుద్ధి కాదు పరిధి చిన్నదైన కొలదీ ఆలోచన సంకుచిత మౌతుంది. ఆడవారిని ఇంట్లో ఉంచబట్టే, వాళ్లు కూపస్థ మండూకాలు అయ్యారు. 'సావిత్రి మీద నా కింత నమ్మకం కానీ, సావిత్రి మారలేదని నమ్మక మేమిటి? ప్రమీలకి మగ స్నేహితులున్నా రని, వాళ్ల దగ్గర డబ్బు తీసుకుంటుం దని అందరికీ తెలుసు. లేమి, అసంతృప్తి ఎంత పనైనా చేయిస్తాయి మనిషి చేత! ఈ నాలుగు నెలలనుంచి సావిత్రికి చాకిరీ అనేదూ తప్ప ఏ

సుఖం లేదు. నన్ను అశక్తుణ్ణిగా చూసి, సావిత్రి ఏమైనా చేసిందంటే మాత్రం.... నేనేం చెయ్యగలను? అట్లాగని సావిత్రి ఏమైనా చేసిందంటే...'

అతడు పళ్లు గట్టిగా బిగించి కాళ్ల వైపు చూసుకున్నాడు నిస్సహాయంగా.

'పొరపా టయిపోయింది. అసలు సావిత్రిని ఉద్యోగంలో చేరనివ్వాల్సింది కాదు. ఇంటి బయటికి పోనివ్వకూడదు ఆడదాన్ని. ఉన్నదానితోనే ఏ గంజో తాగి పడిఉంటే సరిపోయేది. మూర్తి ప్రమీలకి చుట్టం. ఆ వంకతో ఈవిడ ఇంట్లోనే గడుపుతుంటాడు. మళ్లీ భార్య, పిల్లలు ఉన్నారు. అయితేనేం? డబ్బు ఉంది. ప్రమీల ఇంట్లో ఫ్రిజ్ ఉంది. ఖరీదైన ఫర్నిచర్, డన్‌లప్ పిల్లో, సోఫా-కమ్-బెడ్ ఉన్నాయి. గాడ్రేజ్ బీరువా నిండా అన్ని రకాల చీరలు ఉన్నాయి. నెలకి ఒక కొత్త రకం నగ మెరుస్తుంది ఆవిడ ఒంటిమీద. అవన్నీ చూస్తే ఏ ఆడదానికైనా తల తిరిగిపోతుంది. ప్రమీల పెళ్లి చేసుకోలేదు. పెళ్లి ఎందుకు... అన్ని అవసరాలు తీరుతుండగా! చదువు, సంస్కారం ఉన్న యువతి. ఒకరికి ఆదర్శప్రాయంగా బ్రతకవలసిన మనిషి, ఇంకొక స్త్రీ బతుకును దుఃఖమయం చేస్తుంది.

ఈ మహానగరంలో కూడా ఆధునికత విశృంఖలంగా విహారం చేస్తుంది. జనం ఖరీదైన గుడ్డలు కట్టుకుంటున్నారు. సినిమాలు చూస్తున్నారు. హోటళ్లలో తింటున్నారు; తిరుగుతున్నారు. లేమి ఎక్కడ ఉందీ అనిపిస్తుంది. అదంతా సంతృప్తి, సంతోషమేనా? నిజంగా సుఖంగా ఉన్నారా జనం? లేదు! అది మేడిపండు వ్యవహారం!

ఆత్మని అమ్ముకుని సుఖాల్ని కొనుక్కుంటున్నారు జనం.

సుఖమనే పై మెరుగులో ఆంతరంగిక జీవితాన్ని కుళ్ల బెట్టుకుంటున్నారు.

త్యాగం, ధర్మం చేతకానితనమని తీర్మానిస్తున్నారు.

సంఘజీవులమనే సత్యాన్ని విస్మరిస్తున్నారు.

సుఖమే జీవిత పరమార్థమని అడవి మనుషుల సిద్ధాంతాల్ని వల్లె వేస్తున్నారు. అల్ప సుఖాల కోసం మనసులోని స్వర్గాన్ని కూల దోసుకుంటున్నారు. ఇట్లాగుంది ప్రపంచం! సుడిగుండంలాగ ఉంది ప్రపంచం! కొండ శిఖరంలో అగాధపుటంచుల్లో నడుస్తున్నట్లుంది మనిషి బ్రతుకు. శాంతి, తృప్తి. అనేవి ఎక్కడా కనిపించకుండా దూరంగా తరిమేస్తున్నారు మనుషులు. ఈ మనుషులకి పిచ్చి ఎక్కకుండా ఉంటుందా? చీకటి పడింది. సావిత్రి ఎక్కడ ఉంది! ఏం చేస్తోంది'

అతడి తలలో సన్నని నొప్పి బయలుదేరింది.

సావిత్రిని గురించిన ఆరాటం, ఆందోళనతో నిండిన అతడి మనసు తమో

గుణాన్ని ఆశ్రయిస్తూంది. అతడు సాత్వికతను కోల్పోతున్నాడు. రెండు చేతులతో తలను పట్టుకుని, కళ్ళు మూసుకున్నాడు.

* * * *

సావిత్రి ప్రమీల ఇంటికి వెళ్ళింది. ప్రమీల తలుపు తీసి, నవ్వుతూ లోపలికి ఆహ్వానించింది. సావిత్రి సోఫామీద కూర్చుని అంది: ''పండగకి బట్టలు కొందామని బయలుదేరాను. ఒకతెనే వెళ్లబుద్ధి కాలేదు.''

''అంతే కదా! నేనూ చీర కొనుక్కుందా మనుకుంటున్నాను. నేను కూడా వస్తాను. కొంచెం కాఫీ తాగి వెడదాం!'' అంది ప్రమీల.

''ఇప్పుడెందుకు లెండి?'' అంది సావిత్రి.

''అయితే, వచ్చేటప్పుడు వస్తారు కదూ'' అంది ప్రమీల.

సరేనంది సావిత్రి. బజారుకి వెళ్లారు; బట్టలు కొన్నారు. నవ్వుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ ఇంటికి వచ్చారు. ఫ్రిజ్‌లోంచి స్వీట్స్ తీసి గాజు ప్లేటులో పెట్టి, సావిత్రికి ఇచ్చింది ప్రమీల. కాఫీ చెయ్యటానికి లోపలికి వెళ్లింది. అవి తింటూ గదిని పరిశీలిస్తూంది. సావిత్రి వెడల్పయిన కళ్లతో. గదిలో విలువైన వస్తువులన్నాయి. క్లాత్స్, ఫర్నిచర్‌తో అలంకరించబడిన ఆ గది చాలా అందంగా, సుఖంగా ఉంది. అప్పుడు మూర్తి లోపలికి వచ్చాడు. సావిత్రిని చూడగానే అతడి మొహం వికసించింది.

లేవబోతున్న సావిత్రిని వారించి, ''ఏమిటి ఈవేళ అదృష్టం! ఇక్కడికి వచ్చారు?'' అన్నాడు సోఫాలో కూర్చుంటూ.

ప్రమీల కాఫీ తెచ్చింది.

''బజారుకి వెళ్లి చీరలు కొన్నాం పండగ వస్తూంది కదూ'' అంది. చీరలు తీసి చూపించింది. సావిత్రిని చూసి నవ్వుతూ ''అసలు మీకు ఈ చీర లేమిటి? పట్టు చీరలు కట్టాల్సిన మనిషి మీరు'' అన్నాడు మూర్తి.

''విశ్వంగారు పట్టు చీర లేం కొంటాడు? తిండి పెట్టగలిగితే చాలు'' అంది ప్రమీల.

సావిత్రి మొహంలో బాధ కనిపించింది.

''మీరు మాట్లాడుతూ ఉండండి నేనిప్పుడే వస్తాను. మధుని అద్దె అడగాలి'' అని మేడమీదికి వెళ్లింది ప్రమీల.

''మీరు పాపం, చాలా కష్టపడుతున్నారు. పువ్వుల్లో పెట్టి పూజించాల్సిన

మనిషి చేత ఉద్యోగం చెయిస్తున్నాడు విశ్వం. ఏం చేస్తాడు? ఎందుకూ పనికి రానివాడై పోయాడు. అది అతడి దౌర్భాగ్యం. అందుకని ఏడుస్తూ ఇంట్లో కూర్చుంటే మీకు ఇంకా బాధగా ఉంటుంది. మంచి పని చేశారు. అప్పుడప్పుడు వస్తుండండి ప్రమీల దగ్గరికి. బాధ లందరికీ ఉంటాయి. అవి మరిచి పోవాలంటే మధ్యలో కులాసాగా కాలక్షేపం చేస్తుండాలి. కోరికల్ని అణుచుకుంటే జీవితం మీద అసహ్యం పుడుతుంది....''

సావిత్రి లేచి ''ఇంక వెళ్లాలి'' అంది ''అప్పుడే వెళ్లి ఏం చేస్తారు? కూర్చోండి కొంపేమీ మునిగిపోదు. ఎప్పుడూ ఉండేదే కదూ...'' అన్నాడు చనువుగా నవ్వుతూ.

సావిత్రికి ఏం చేయాలో తెలీటం లేదు. మళ్లీ కూర్చుంది.

''మిమ్మల్ని చూస్తే పెళ్లయిందని, ముగ్గురు పిల్లల తల్లి అని ఎవరూ అనుకోరు. మీ ముందు ప్రమీల కూడా అందగత్తె అనిపించదు. మిమ్మల్ని చూసినప్పుడు విశ్వం చాలా అదృష్టవంతుడని అనుకునేవాడిని. మీకు ఏ సుఖం లేకుండా పోయింది. కానీ, మీరు అనుకుంటే మీకు లభించనిదేం ఉంది? అన్ని సుఖాలూ సమకూరుతాయి. మీరు ఏది కోరితే అది మీ ఇంట్లో ఉంటుంది. ఉద్యోగం కూడా చెయ్యనవసరం లేదు. మీరంటే నాకంత అభిమానం, ఆకర్షణ. తెలుసా! ఎందుకల్లాగ చూస్తారు? నీతి అని నీరసపు కబుర్లు చెబుతూ సుఖాల్ని వదులుకోవటం బుద్ధి తక్కువ పని. అసలు సుఖం అందుబాటులో లేనివాళ్లు చెబుతారు నీతులు. మీరే చెప్పండి, మీకు సుఖంగా ఉండాలని ఉండదూ? హాయిగా అన్నీ అనుభవించాలని ఉండదూ? ఉంటుంది!'' సావిత్రి కళ్లలోకి కాంక్షతో చూస్తూ అన్నాడు మూర్తి.

సావిత్రి కంపిస్తూ కళ్లు వాల్చుకుంది. సావిత్రి భుజంమీద చేయివేసి, 'సావిత్రీ!'' అంటూ మత్తుగా కనులరమూసుకున్నాడు మూర్తి.

చీకటి గాఢాంధకారమవుతుంటే ఇంటికి వచ్చింది సావిత్రి. సరాసరి విశ్వం గదిలోకి వచ్చింది. పిల్లలు తల్లి కోసం ఎదురుచూసి, అక్కడే పడుకుని నిద్ర పోతున్నారు. సావిత్రి అతడి దగ్గిరకి వచ్చింది. తల రేగిఉంది. బొట్టు చెరిగి ఉంది. కళ్లు గాజుకళ్లలా ఉన్నాయి. పెదవులమీద చిరునవ్వు ఉంది. వేశ్య ముఖంమీద వేలాడే నవ్వు! విషం అద్దిన పువ్వు. తనని మరిపించాలని ఎత్తు! ఆ నవ్వు నవ్వుతూ, ''ఆలస్యమయింది!'' అంది. చేతిలో పెద్ద పాకెట్ ఉంది. దాని వైపు చూస్తున్న విశ్వం కళ్లు నిప్పులు కక్కుతున్నాయి. మనసు బుసలు కొడుతూంది. గుండెలో రక్తం లావాలా మరిగిపోతూంది. బల్లమీదున్న పళ్లు కోసే కత్తిని చేతిలోకి తీసుకున్నాడు. పళ్లు బిగించి ''ఆలస్యమయిందా?'' అంటూ గురి చూసి సావిత్రి గుండె మీదికి విసిరాడు.

ఒంటిపొరా వ్రేలాడుతున్న చీరలోంచి దిగబడిపోయింది. రక్తం! చీరంతా. నేలంతా రక్తం. ''సావిత్రీ!'' గట్టిగా అరిచాడు విశ్వం.

సావిత్రి పలకటం లేదు. అతడి ఒళ్లంతా చెమటలు పట్టేసింది. 'ఏం జరిగింది? ఏం జరగబోతోంది? ఈ పిల్లలికి తల్లి లేదు. ఎంత పని చేశావు, సావిత్రి! ఎంత పని చేశాను నేను!

పోలీసులు వస్తారు. నన్ను పట్టుకు పోతారు. ఈ పిల్లలకి తండ్రి కూడా ఉండడు'— రెండు చేతులతో కళ్లు మూసుకున్నాడు. మనసులోంచి దుఃఖం ఆనకట్ట విరిగినట్టు పొర్లుతూంది.

''నాన్నా! అమ్మ వచ్చింది ఏడుస్తోంది.'' వసంత గది గుమ్మంలో నిలబడి అంది ఉలికిపడ్డాడు విశ్వం. తల పైకెత్తాడు.

''అమ్మా! ఏ అమ్మ'' అనబోయాడు. చప్పున అతడికి తెలివి వచ్చిన ట్లయింది. నేలమీద చూశాడు. సావిత్రి శవం లేదక్కడ! ఎంత ఘోరంగా ఊహించాడు? భ్రమలో లీనమై ఎంత చిత్తక్షోభననుభవించాడు? నరకాన్ని చూశాడు!! సావిత్రి వచ్చింది. ఏడుస్తూందా? ఏందుకేడుస్తూంది!

అతడి భ్రుకుటి ముడిపడింది.

''వచ్చిందా! అక్కడ ఏం చేస్తోంది! ఇటు రమ్మను'' అన్నాడు.

సావిత్రి లోపలికి వచ్చి నించుంది. మొహమంతా పాలిపోయి ఉంది. కళ్లు ఏడిచినట్లుగా ఉన్నాయి.

''మీ రంతా అవతలికి పోండి.'' గర్జించాడు విశ్వం, సావిత్రి వెనక నిలబడిన పిల్లల్ని చూసి. పిల్లలు తండ్రిని విచిత్రంగా చూసి బయటికి వెళ్లారు.

అతడు సావిత్రిని నఖశిఖపర్యంతం పరిశీలించి, ఏమయింది! ఎందుకా ఏడుపు?'' అన్నాడు నిర్దాక్షిణ్యంగా. అతడి చూపుల్లో అసహ్యం నిండి పొర్లిపోతోంది.

సావిత్రి అతడికి దగ్గరగా వెళ్లింది.

''దురదృష్టవంతుల్ని ఎక్కడికి వెళ్లినా అది వెంటాడుతూ ఉంటుంది. వద్దంటే వినలేదు మీరు. వంద రూపాయిలిచ్చారు. గుడ్డలు చూస్తున్నాను. చాలా మది ఉన్నారు షాపులో. పర్సు చేతిలోదే జారిపోయిందో, ఎవరైనా తీశారో తెలియయదు. అంత మందిలో ఎవరి నడగను? అంతా నా బుద్ధి తక్కువ అజాగ్రత్త. వంద రూపాయలు పోయాయి. గుడ్డలు అక్కడే వదిలేశాను ఇంటికి రాబుద్ధి కాలేదు. ఎన్ని అవసరాలు

తీరేవి! ఎన్ని మందులూ, పళ్ళూ వచ్చేవి. పిల్లలు ఏమడిగినా కొనటం లేదు. ఎందుకూ కాకుండా మట్టిలో ఒలికిన పాలైపోయింది. వెధవ పని చేశాక ఎంత ఏడిచి ఏం లాభం! మీ మొహం చూడటానికి కూడా మనసు ఒప్పలేదు. వంద రూపాయలు! ఎక్కడ నుంచి ఎల్లా తేగలను! ఎన్నో ఆలోచనలు వచ్చాయి. ప్రమీలని అప్పు అడిగి మెల్లిగా తీర్చేద్దామనుకున్నాను. అడగలేదు. ఇంత వరకూ గుళ్ళో కూర్చుని, ఉత్త చేతులతో ఇంటికి వచ్చాను. మరి మీ దగ్గరికి రాక ఎక్కడికి పోతాను నేను!'' అంది

విశ్వం చటుక్కున సావిత్రని తన పక్కలోకి లాక్కున్నాడు.

నువ్వు వచ్చావు. చాలు, సావిత్రీ అవును, ఎక్కడికి పోతావు!'' అన్నాడు వెర్రిగా.

సావిత్రి విచిత్రంగా చూసిందతడి వైపు. డబ్బు పోయి తను బాధ పడుతుంటే ఏదో పెన్నిధి దొరికినట్లూ స్వర్గంలో ఉన్నట్లూ మాట్లాడుతున్నాడతడు.

''ఏమిటంటున్నారు?'' అంది అతడిని చూస్తూ.

విశ్వం నవ్వాడు.

''వంద రూపాయలు పోయాయా? పోతే పోనీ. జీవితంలో చాలా మంది చాలా పోగొట్టుకుంటూ ఉంటారు. వాటికి విలువ కట్టలేము. వాళ్ళకి వాటి విలువ తెలీదు కూడా. వంద రూపాయలొక లెఖ్ఖా! నాకు నువ్వు ఉన్నావు చాలు, సావిత్రీ! నాలుగు నెలల్లో కట్లు విప్పుతారు. నేను ఉద్యోగం చేస్తాను. మళ్ళీ మనకి డబ్బు వస్తుంది. నీకు, పిల్లలకి కావలసినవన్ని గుడ్డలు కొంటాను. మళ్ళీ పండగలు వస్తాయి. నువ్వు ఉంటే అన్నీ వస్తాయి, సావిత్రీ!' అన్నాడు.

పోయిన స్వర్గం చేతుల కందినట్లు ఉంది. సుఖంగా ఉంది అతడికి.

* * * *